క్లుప్తంగా

'కిట్స్'లో నేషనల్ వర్క్‌షాప్



గుంటూరు రూరల్: వర్క్ షాపులు నిర్వహించటం వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో సోమవారం హైదరాబాదుకు చెందిన బెయినో విజన్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో ఐదురోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్క్‌షాప్‌లో విద్యార్థులకు వెబ్ అప్లికేషన్స్ ఎలా డెవలప్ చేయాలి, ఇన్నోవేటివ్ ఆలోచనలను ఎలా సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్‌గా తయారు చేయాలని వివరించారు. ఆధునిక పద్ధతులు, టెక్నాలజీని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ బానుప్రకాష్ పాల్గొన్నారు.

వృద్ధురాలిపై లైంగి దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

పెదనందిపాడు: నిద్రిస్తున్న 85 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ప్రత్తిపాడు సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు. సోమవారం పెదనందిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత రాత్రి వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడింది పశ్చిమ గోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన పాలపర్తి అంజుగా గుర్తించినట్లు తెలిపారు. కొన్ని నెలలుగా పెదనందిపాడు ప్రాంతంలోనే అతను ఉంటూ, రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్నాడని చెప్పారు. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితుడి కోసం విచారించినట్లు తెలిపారు. పెదనందిపాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి సోమవారం ఉదయం పెదనందిపాడు ప్రాంతంలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బారావు వివరించారు. నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్ఐ అబ్దుల్ రెహమాన్, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

చేబ్రోలు: అర్ధరాత్రి మహిళ ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై చేబ్రోలు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వేజండ్ల గ్రామానికి చెందిన బలగాని వంశీకృష్ణకు మూడు నెలల క్రితం ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన మహిళతో వివాహం అయ్యింది. 30న అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భర్త వంశీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పొన్నూరు అర్బన్ సీఐగా అల్తాఫ్ హుస్సేన్



చేబ్రోలు: పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎండీ కాజా అల్తాఫ్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తాడేపల్లి పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన ఎం.బాబి నెల్లూరు టూ టౌన్ సీఐగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ అల్తాఫ్ హుస్సేన్‌కు అర్బన్ ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు, సిబ్బంది సహకారంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు, శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటానని సీఐ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలను నిలువరించి జరిమానాలు విధించారు. పలు వాహనాలకు సంబంధించి మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. జాగ్రత్తలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న ప్రవచనం



పాతగుంటూరు: బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం వేంకటేశ్వరస్వామి సుప్రభాతంలోని రెండవ భాగమైన వేంకటేశ్వర స్తోత్రం అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు కేవీ కోటేశ్వరరావు ప్రవచనం చేశారు. చీకటిలోని వస్తువు కనపడాలంటే దీపం కావాలని, అలాగే భగవంతుని తెలుసుకోవాలంటే జ్ఞాన దీపం కావాలన్నారు. ఆ దీపాన్ని వెలిగించే వాడే గురువు అన్నారు. కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఊపిరి తీస్తోంది...

నేడు వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే

- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించాలి
- పొగతాగని వారికి సైతం ఊపిరితిత్తుల క్యాన్సర్
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



గుంటూరు మెడికల్: ఊపిరి తిత్తుల క్యాన్సర్‌ను వైద్య నిపుణులు సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటున్నారు. ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకడం ద్వారా త్వరితగతిన మరణాలు సంభవిస్తున్నాయి. మనిషి ఊపిరి తీసుకునేందుకు తద్వారా అతడు జీవించి ఉండేందుకు ఉపయోగపడే ఊపిరితిత్తులకు క్యాన్సర్‌లు సోకడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఆధునిక జీవనశైలి వల్ల వాహనాల వినియోగం పెరిగిపోవడం, పచ్చదనం తగ్గిపోవడం పారిశ్రామికరణ పెరిగిపోవడంతో ఊపిరితిత్తుల క్యాన్సర్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రజలు వ్యాధి బారిన పడకుండా ప్రపంచ వ్యాప్తంగా 2012 నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 1న వరల్డ్ లంగ్ క్యాన్సర్ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

రావటానికి కారణాలు...

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. సిగిరెట్లు, హుక్కా, గంజాయి పీల్చటం. ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకిన వారిలో నూటికి 90 శాతం మంది పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డారు. సాధారణ వ్యక్తితో పోలిస్తే పొగతాగేవారిలో క్యాన్సర్ రావటానికి 2.5శాతం రెట్లు అవకాశం ఎక్కువ. పొగ కారణంగా, వాహనాల కాలుష్యం వల్ల, రేడియేషన్ వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల, హెచ్‌పీవీ వైరస్ ఇన్‌ఫెక్షన్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

వీరికి ఎక్కువగా ఊపిరితిత్తుల క్యాన్సర్...

పొగతాగేవారికంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. మహిళలు, పిల్లలు ఈ బాధితులే. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారురోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనేవారికి ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నట్లు వైద్య నివేదికలు తెలియజేస్తున్నాయి. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సరే కాకుండా శరీరంలోని ఇతర అవయవాలకు సైతం క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ధూమపానం చేసేవారితోపాటు వారి పక్కన ఉండే కుటుంబ సభ్యులు ఎక్కువ శాతం క్యాన్సర్‌బారిన పడుతున్నారు. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65శాతం మంది మహిళలు, 35 శాతం మంది పురుషులు ఉన్నారు.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు...

జిల్లాలో 50 మంది పల్మనాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు నెలలో ఇరువురు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రతివారం ముగ్గురు బాధితులు చికిత్స పొందుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా క్యాన్సర్ వైద్యసేవలు ఉచితంగా పేదలకు అందిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఓపీ విభాగంలో, అత్యవసర బాధితులకు 24 గంటలు క్యాన్సర్ వైద్యసేవలు అందిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు...

విడవకుండా దగ్గు రావటం, దగ్గులో రక్తం పడటం, ఆకలి లేకపోవటం, ఛాతీలో నొప్పి, గొంతు బొంగురు పోవటం, ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే బరువు తగ్గిపోవటం, ఎముకలు, కీళ్లు, వెన్ను, నడుంనొప్పి ఎక్కువ కాలం ఉండటం, శ్వాస సరిగా ఆడకపోవటం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడటం, నిద్రలో గురకరావటం, తరచుగా జబ్బు బారిన పడటం లాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

ఈ జాగ్రత్తలు పాటించండి....



ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.

– డాక్టర్ బి. దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు.

అందుబాటులో ఆధునిక వైద్యం...



క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. గతంలో క్యాన్సర్లు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్నవారిలో వచ్చేవి. నేడు 30 ఏళ్లకే క్యాన్సర్లు రావడం చాలా బాధాకరం.

– డాక్టర్ ఎం.జి. నాగకిషోర్, సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

విజ్ఞాన్‌లో ఎంటెక్- ఐఓటీ కోర్స్ ప్రారంభం



ఎంటెక్ - ఐఓటీ కోర్స్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న వీసీ నాగభూషణ్

చేబ్రోలు: గుంటూరు జిల్లాలోని విజ్ఞాన్ యూనివర్సిటీ(వడ్లమూడి)లో వందశాతం ఫీజు రాయితీతో కూడిన ఎంటెక్- ఐఓటీ(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) కోర్సు ప్రారంభించనున్నట్లు వైస్ చాన్సలర్ పీ నాగభూషణ్ తెలిపారు. ఎంటెక్- ఐఓటీ కోర్స్‌కు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. విజయవాడలోని ఎప్ట్రానిక్స్ కంపెనీ పార్టనర్‌గా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. బీటెక్‌లో ఈసీఈ, ఈఐఈ, ఈఈఈ, ఈసీఎం, సీఎస్ఈ మరియు ఐటీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షను ఆగస్టు 5వ తేదీన విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.10,000 వేతనంతో కూడిన స్టైఫండ్ కూడా అందిస్తామని వెల్లడించారు. ఎంటెక్- ఐఓటీ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వీసీ వివరించారు.

కోడిపందేల నిర్వాహకులపై కేసు

తాడికొండ: కోడిపందేల నిర్వాహకులు అబ్బూరు లీలాప్రసాద్, కొంత మందిపై కోడిపందెం నిర్వహించినందుకు నన్నెబోయిన బాజీపై దాడిచేసినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు. కోడిపందేల నిర్వహణలో వచ్చిన వివాదంలో బాధితుడిపై దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తుళ్లూరు మండలం ఐనవోలు పొదల్లో ఉన్న పాత ఇనుమును చోరీ చేస్తున్న నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ ఆనందరావు తెలిపారు. ఐనవోలు పొదల్లో ఉన్న పాత ఇనుమును బొజ్జగాని రేణుక, మరికొంత మంది ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్ అరివేణి నాగరాజుతోపాటు, ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఫిర్యాదులు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులదే బాధ్యత

నగర కమిషనర్ చేకూరి కీర్తి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులు రీ ఓపెన్ అయితే విభాగాధిపతులే బాధ్యత వహించి, నేరుగా పరిశీలించి పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డ్ సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు.

42 ఫిర్యాదులు...

సోమవారం నిర్వహించిన స్పందనలో 42 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 8, ఇంజినీరింగ్ విభాగానికి 16, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 3, అకౌంట్స్ విభాగానికి 3, పరిపాలన విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి 3 చొప్పున అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఓటర్ సర్వే పక్కాగా జరగాలి..

నెహ్రూనగర్: ఇంటింటి ఓటర్ సర్వే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పక్కాగా జరగాలని, సూపర్‌వైజర్ అధికారులు మరింత బాధ్యతగా సర్వే పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో విభాగాధిపతులు, సూపర్వైజరి, నోడల్ అధికారులతో ఓటర్ సర్వే, డోర్ నంబర్స్ కేటాయింపు, స్వచ్ఛ సర్వేక్షణ్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత నెల 21 నుంచి ఆగస్ట్ 21 వరకు జరిగే ఇంటింటి ఓటర్ సర్వేలో బీఎల్‌ఓలు ప్రణాళికాబద్ధంగా సర్వే చేయాలని, ప్రతి ఇంటిలో ఓటర్ల సమగ్ర నివేదిక ఉండాలన్నారు. సదరు ఓటర్లు అదే డోర్ నంబర్‌లో ఉంటున్నారా, ఫొటోలు సరిగా ఉన్నాయా, వయస్సు, జెండర్, పేర్లు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. సూపర్‌వైజరీ అధికారులు సర్వేని మరింతగా క్షేత్రస్థాయిలో సర్వేని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌ల ద్వారా ఫోన్‌లకు వచ్చే ఓటీపీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల, స్వచ్ఛ సర్వేక్షణ్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, రవీంద్ర, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ శివన్నారాయణ, సూపర్వైజరీ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నవజాత శిశు కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్స్ వార్డులో నవజాత శిశువు చికిత్స కేంద్ర నిర్మాణం కోసం సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయితే 20 పడకల నుంచి 40 పడకలు వరకు పెరుగుతాయని డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, పిల్లల వైద్య విభాగం వైద్యులు మోహన చంద్ర, రమేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ అసిస్టెంట్ ఇంజినీర్ కుంచె వెంకట రత్తయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

అస్మత్ తారకు సేవ ఆరోగ్య మిత్ర పురస్కారం



గుంటూరు వెస్ట్: తెనాలి జిల్లా వైద్యశాలలో పని చేస్తున్న షేక్ అస్మత్ తార జూన్ నెలలో సేవ ఆరోగ్య మిత్రకు ఎంపికయ్యింది. దీంతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అస్మత్ తారకు ప్రశంసాపత్రంతోపాటు రూ.5000 నగదు బహుమతి అందజేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జయకృష్ణ పాల్గొన్నారు.

వేస్ట్ పిక్కర్లపై అధ్యయనం అభినందనీయం



అధ్యయన నివేదిక ఆవిష్కరణ

నెహ్రూనగర్: గుర్తింపులేని వృత్తులు చేస్తున్న వారి ఆరోగ్యం, పౌష్టికాహార సమస్యలపై అధ్యయనం చేయడం శుభపరిణామని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.గోపాలరావు తెలియజేశారు. సోమవారం అమరావతిరోడ్డులోని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) కార్యాలయంలో అధ్యయన నివేదికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి గుర్తింపునకు నోచుకోక దుర్భర జీవితాలను గడుపుతున్న వేస్ట్ పిక్కర్ల కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, పోషకాహార సమస్యలపై చేసిన అధ్యయనం వారి జీవితంలో కనీస మార్పునకు దోహదపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి పనబాక కృష్ణయ్య, డాక్టర్ చిక్కాల నాగరాజు, డాక్టర్ వై.శ్రీనివాసులు, డీబీఆర్‌సీ కార్యదర్శి అల్లడి దేవకుమార్, ప్రోగ్రాం మేనేజర్ చుక్కా శామ్యూల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ



నెహ్రూనగర్: వెంగళరావునగర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో చిన్నారులకు ఆట వస్తువులు, భోజన ప్లేట్లను ఆళ్ల వెంకట రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆళ్ల కోటిరెడ్డి అందజేశారని స్కూల్ హెచ్‌ఎం రమేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. రవీంద్ర, డేవిడ్, పున్నారావు, పీటర్ పాల్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో లక్ష్యాన్ని సాధించవచ్చు



మాట్లాడుతున్న వీఆర్ఓ అధ్యక్షుడు గోపాలరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ) విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతిక విద్యను నైపుణ్యంతో నేర్చుకోవాలని, తద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్(వీఆర్ఓ)ప్రెసిడెంట్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.గోపాలరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఉన్నత పాఠశాలకు పెదకాకానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ రూ.1,50,000ల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)ను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాలరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు వివిధ రూపాల్లో తమ వంతు సాయం అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జాయింట్ డైరెక్టర్ ఫాదర్ వేలాంగిణి, సీటీఓ ఎం.సుబ్రహ్మణ్యం, విశ్రాంత అధ్యాపకుడు కె.భాస్కరరావు, అడ్వకేట్ కేజేఎస్ ప్రకాశరావు, టి.సుబ్బారావు, టి.రమాదేవి, డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ ప్రెసిడెంట్ ఆర్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహారావు, ట్రెజరర్ డి.నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బి.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ముడి జింకు

కాకుమాను: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ముడి జింకు అందుబాటులో ఉందని ఏఓ కె.కిరణ్మయి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు కావాల్సిన జింకు అందజేస్తున్నట్లు తెలిపారు. వరి సాగు చేసే రైతులు ఎకరాకు 20 కేజీలు, మెట్ట పంటలు సాగుచేసే రైతులు ఎకరాకు పది కేజీల జింకును పంట పొలాల్లో పిచికారి చేసి, జింకు లోపం లేకుండా చేసుకోవాలని ఆమె సూచించారు. పది కేజీల సంచి రూ.600లు అని ఆమె తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

వైభవంగా 182వ గాస్పల్ డే వేడుకలు



కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న పాస్టర్లు, సంఘస్తులు

పాత గుంటూరు: బ్రాడీపేటలోని నార్త్‌ప్యారిష్ చర్చిలో ఆంధ్ర సావార్తిక లూథరన్ సంఘం (ఏఈఎల్‌సీ) 182వ ఆవిర్భావ (సువార్త) దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్, క్రైస్తవ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎం.బాలస్వామి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనార్టీ సెల్ చైర్మన్ ఎం.జాన్సన్, విశ్రాంత ప్రొఫెసర్ రెవరెండ్ డాక్టర్ వి.మాణిక్యరావు పాల్గొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏఈఎల్‌సీ మోడరేటర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ కె.ఎఫ్.పరదేశిబాబు మాట్లాడుతూ ఏఈఎల్‌సీ వ్యవస్థాపకుడు రెవరెండ్ జాన్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ హయ్యర్ ఉన్నతమైన ఆశయంతో సంఘాన్ని స్థాపించారని అన్నారు. సేవా కార్యక్రమాలతో పేద ప్రజలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో సంఘం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సంఘ సభ్యులు ముందుకుసాగాలని తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఏఈఎల్‌సీ కార్యదర్శి సి.హెచ్.కిషోర్‌బాబు, ఉపాధ్యక్షుడు రెవరెండ్ ఎ.జేమ్స్, కోశాధికారి కె.మోజెస్ ఆర్నాల్డ్, పాస్టర్లు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన..

మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను అరికట్టి, శాంతియుత వాతావరణం నెలకొల్పాలని బిషప్ పరదేశిబాబు కోరారు. మణిపూర్‌లో బాధిత క్రైస్తవులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరుతూ నార్త్ ప్యారిష్ చర్చిలో కొవ్వొత్తులతో సంఘీభావాన్ని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. కొమ్మూరు ఎస్సీ కాలనీలో జెడ్పీ నిధులు రూ.పది లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి, పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి, ఎంపీటీసీ గేరా అలేఖ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, జేసీఎస్ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, డాక్టర్ అసదుల్లా తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



తెనాలిటౌన్: రూరల్ మండలం తేలప్రోలు, ఐతానగర్ గ్రామాల్లో సోమవారం వ్యవసాయాధికారులు వరి పొలాలను పరిశీలించారు. తెనాలి వ్యవసాయ సహాయం సంచాలకులు ఎస్.ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి. ప్రే మ్‌సాగర్‌లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వెద పెట్టిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ తెనాలి మండలంలో 17,947 ఎకరాలు మాగాణీ విస్తీర్ణంలో రైతులు రెండువేల ఎకరాలకు పైబడి వెద పద్ధతిలో వరిసాగు చేపట్టారని తెలిపారు. 10 నుంచి 20 రోజుల దశలో పైరు ఉందని, వర్షాలకు నీట మునగటం వలన పంట నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపే ప్రయత్నం చేయాలని రైతులకు సూచించారు. ఆగస్టు నెల వరకు బీపీటీ 5204 రకం వరి సాగు చేయవచ్చని చెప్పారు. నారుమళ్లు పోసి ఉన్నట్లయితే నాట్లు వేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తేలప్రోలు వీఏఏ హర్షిష్ వర్మ, అర్బన్ వీఏఏ ఆళ్ళ తేజశ్రీ, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

గుంటూరు ఈస్ట్: విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని సోమవారం కొనసాగించారు. లిబర్టీ థియేటర్ సమీపంలోని డీ-3 సెక్షన్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి నాజ్‌సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించకపోతే ఆగస్టు 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జేఏసీ చైర్మన్ ఆంజనేయులు, కార్యదర్శి రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



నెహ్రూనగర్: చట్టాలు, హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి చంద్రమౌళీశ్వరి తెలియజేశారు. సోమవారం శ్యామలానగర్ చివర ఉన్న బంజార కాలనీలోని ఎస్టీలకు చట్టాలపై, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎస్టీలకు సంక్రమించిన హక్కుల గురించి తెలియజేశారు. కోర్టులకు సంబంధించిన కేసులపై అవగాహన కలిగి ఉండాలని, ఏమైనా న్యాయ సలహాలు కావాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో డీటీడబ్ల్యూఓ డి.మధుసూధనరావు, సీనియర్ అడ్వకేట్ కాశీదాసు, సచివాలయ సెక్రటరీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.